## క్లుప్తంగా

### మహాత్మా జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలి



విద్యార్థులకు మహాత్మా జ్యోతిరావు పూలే జీవిత చరిత్రను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

**పెదపాడు:** జ్యోతిరావు పూలేను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని గ్రంథపాలకుడు డీ జాన్‌బాబు తెలిపారు. పెదపాడు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు మహాత్ముల జీవిత చరిత్రలను వివరించారు. అనంతరం నిడమర్తి ఉమారాజేశ్వర రావు అనువాదం చేసిన తాత తపన మనవడి మథన పిల్లల కథను బాలబాలికలచే చదివించడం, పుస్తక సమీక్షను నిర్వహించారు. విద్యార్థులకు ఇండోర్‌గేమ్స్‌ను నేర్పించడం జరిగింది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయుడు మోహన్, తదితరులు పాల్గొన్నారు.

### పాఠశాల సంసిద్ధత ఉత్సవం



సంసిద్ధత ఉత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**ఏలూరు (టూటౌన్):** స్థానిక లంకపేట–1, –2 అంగన్‌వాడీ కేంద్రాల్లో పాఠశాల సంసిద్ధత ఉత్సవాన్ని సోమవారం నిర్వహించారు. శారీరక, మేధ, సాంఘిక అభివృద్ధుల గురించి ఏలూరు అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ విజయలక్ష్మి తల్లిదండ్రులకు, పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన డే నిర్వహించారు. సెక్టార్–1 సూపర్ వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

### దేశ సేవలకు మై భారత్ వలంటీర్లు

**ఏలూరు రూరల్ :** దేశ సేవ కోసం యువత మై భారత్ డిఫెన్స్ వలంటీర్ల వ్యవస్థలో చేరాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా యూత్ ఆఫీసర్ సుంకర రాము ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వం మై భారత్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. సంక్షోభం సమయం దేశానికి సేవా చేసేందుకు బలమైన, స్వచ్ఛంద దళం రూపొందించడమే దీని ఉద్దేశమని పేర్కొన్నారు. అత్యవసర సమయాల్లో ప్రభుత్వ అధికారులతో కలిసి జన సమూహ నియంత్రణ, ప్రజాభద్రత, విపత్తు సమయంలో సేవా కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొంటారని వివరించారు. ఆసక్తి గల యువత పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పూర్తి వివరాలకు సెల్ నెంబర్ 94375 05290లో సంప్రదించాలని పేర్కొన్నారు.

### క్రీడా పరికరాల పంపిణీ



క్రీడా పరికరాలు అందిస్తున్న ఎమ్మెల్యే చంటి

**ఏలూరు రూరల్ :** బాలబాలికలు వేసవి క్రీడా శిక్షణ శిబిరంలో పాల్గొని మంచి క్రీడాకారులుగా ఎదగాలని ఎమ్మెల్యే బడేటి చంటి ఆకాంక్షించారు. సోమవారం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు క్రీడా పరికరాలు ఆయన చేతులు మ2ఈదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడల సాధన ద్వారా పిల్లలు మానసిక, శారీరక పటుత్వం పొందుతారని చెప్పారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 50 వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేశామని, వీటికి క్రీడా పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. మే నెల 31 రోజుల పాటు బాలబాలికలకు బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, చెస్, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో శిక్షణ అందిస్తున్నామని వివరించారు. ఇందుకోసం డీఎస్‌ఏ శిక్షకులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులను నియమించామని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ న్యాయ నిర్ణేత బడేటి వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

### మురళి నాయక్‌కు ఘన నివాళి



మురళి నాయక్‌కి జోహార్లు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

**కొయ్యలగూడెం:** ఉగ్రవాదంపై పోరులో అశువులు బాసిన బాసిన మురళి నాయక్ సంస్మరణ కార్యక్రమం సోమవారం జంగారెడ్డిగూడెం రోడ్డులోని సీఐటీయూ కార్యాలయం వద్ద నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శుకబోయిన రాంబాబు మాట్లాడుతూ ఉగ్రవాదంపై పోరులో అసువులు బాసిన మురళి నాయక్‌తో సహా అమరులైన సైనికులకు భారత జాతి రుణపడి ఉందన్నారు. పీఓకేని స్వాధీనం చేసుకుంటేనే ఉగ్రవాదానికి అడ్డుకట్ట వేయొచ్చన్నారు. అనంతరం సమావేశం నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.రమేష్, మర్రి సుబ్రహ్మణ్యం, ఎస్.శివకుమార్, పి.తమ్మారావు, ఎం.నాగేంద్ర బాబు, సీహెచ్ మరిదయ్య, కె.దుర్గారావు, కె.నాగరాజు, డి.వీర్రాజు పాల్గొన్నారు.

# భగ్గుమంటున్న భానుడు

- ఎండకు అప్రమత్తతే అండ
- ముందస్తు చర్యలకు ఉపక్రమించని ప్రభుత్వం
- గ్రామాల్లో వడదెబ్బకు గురవుతున్న ప్రజలు
- అధిక ఉష్ణోగ్రతలు వేళ బయటకు వెళ్లవద్దని ఆరోగ్య శాఖ సూచన



ఎండ దెబ్బతో జన సంచారం లేక వెలవెలబోతున్న రహదారులు

**భీమడోలు:** రోహిణీ కార్తె దగ్గర పడటంతో భానుడి ప్రతాపం మరింత పెరిగింది. జనవరి నుంచి ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ప్రతి రోజూ 30 డిగ్రీల నుంచి 35 డిగ్రీల వరకూ ఉష్ణోగ్రత ఉంటుంది. గ్రీష్మ తాపానికి ప్రజలు అల్లాడిపోతుంటే సోమవారం భానుడి భగ భగలకు మరింతగా ఉక్కిరి బిక్కిరయ్యారు. సోమవారం 38 డిగ్రీల ఉష్ణోగ్రత ఉండగా 45 డిగ్రీల వేడిని తలపించిందని వాతావరణ శాఖ సూచించింది. మండుటెండలతో ప్రజలు బెంబేలెత్తిపోయి, సాయంత్రం ఆరు గంటల వరకూ ఇళ్ల నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. ఎండ వేడికి వీస్తున్న వడగాలులకు వృద్ధులు, పిల్లలు తల్లడిల్లిపోతున్నారు. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు, గణపవరం మండలాలకు ఆరోగ్యశాఖ, అంగన్‌వాడీ, ఆశావర్కర్లు వేసవిలో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ కాలంలో సంభవించే వడదెబ్బ వల్ల కలిగే అనారోగ్య సమస్యల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టకపోవడం, ఆపద వేళ తక్షణ చర్యలుపై ప్రత్యేక ప్రణాళికలు లేవు. అయితే గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వడదెబ్బపై సరైన ప్రచారం లేకపోవడంతో వడదెబ్బన బారిన పడుతున్నారు. దీంతో ప్రభుత్వ లెక్కల్లోకి రాని మరణాలు సంభవిస్తాయి.

**సేవలిలా..**

గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి వెయ్యి మందికి ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఆ పరిధిలోని సచివాలయాల్లోను, అంగన్‌వాడీ, పీహెచ్‌సీ, సబ్‌సెంటర్ల వద్ద ప్రతి రోజు 20 నుంచి 50 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతారు. ఉపాధి హామీ పథకం పనుల వద్ద ప్రత్యేకంగా మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు అందుబాటులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఉంచారు. పని చేసే వేళల్లో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను నీటిలో కలుపుకుని తాగే విధంగా చర్యలు చేపట్టారు. అయితే ఉపాధి హామీ పథకం పనులకు మాత్రం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండడం లేదని కార్మికులు గగ్గోలు పెడుతున్నారు.

**వడదెబ్బ నివారణ ఇలా..**

వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో వేడి గాలుల వల్ల వడదెబ్బ, డిహైడ్రేషన్ సాధారణంగా వచ్చే వ్యాధులు, సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే ప్రాణాంతకంగా మారుతుంది. కళ్లు తిరగడం, శరీరమంతా వేడిగా ఉండడం, చెమటలు పట్టడం వంటి సూచనలు కనిపిస్తే వడదెబ్బ గురైనట్లుగా భావించి సమీపంలోని ఆసుపత్రికి తీసుకుని రావాలి. అక్కడ వారికి వైద్య చికిత్స అందించడం జరుగుతుంది. అధిక ఉష్ణోగ్రతలు వేళ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలకు రోడ్లపై తిరగరాదు. ఎండలో వెళ్లితే విధిగా టోపియో, గొడుగు, తలపాగా ధరించాలి. నూలు వస్త్రాలు ధరిస్తే మంచిది. వేడిగాలి ఇంట్లోకి ప్రవేశించకుండా కిటికీలకు గోనే పట్టాలు అడ్డుగా పెట్టుకోవాలి. ఎవరికైనా వడదెబ్బ తగిలితే నీడకు తీసుకుని వచ్చి చల్లని నీటితో ఒళ్లంతా తుడవాలి. ఫ్యాన్‌తో గాని విసనకర్రతో గాని చల్లబర్చాలి. ఎక్కువగా నీరు, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజ్ నీరు, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తాగించాలి. పరిస్థితి విషమిస్తే సమీపంలోని పీహెచ్‌సీ వద్దకు తీసుకుని వెళ్లాలి.

### రోజుకు 15 గ్లాసుల నీటిని తాగాలి



వడదెబ్బ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ప్రజలకు ప్రజలందరికి అవగాహన కల్పించి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో సచివాలయాల వద్ద అందుబాటులో ఉంచాం. బీపీ, సుగర్స్ వ్యాధిగ్రస్తులు పరిమితంగా వాటిని తాగాలి. ప్రతి ఒక్కరూ 4 నుంచి 6 లీటర్ల ద్రవ రూపంలో ఉన్న పానీయాలను తాగాలి. చెమట రూపంలో నీరు బయటకు పోవడం వల్ల నీరసంగా ఉంటుంది. ఎండలో తిరగరాదు. ఎండలోకి వచ్చే తరుణంలో టోపి, గొడుగు, తలపాగాయే ధరించి రావాలి. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే సమీపంలోని ఎఎన్‌ఎం వద్దకు గాని ఆసుపత్రికి తీసుకుని రావాలి. – ఆర్.జాహ్నవి కృష్ణ, వైద్యాధికారిణి, గుండుగొలను



గుండుగొలనులో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను ఇంటింటికీ పంపిణీ చేస్తున్న ఆరోగ్య శాఖ



మండుటెండలో బస్సుల కోసం వేచి చూస్తూ తలపై చీర చెంగును వేసుకున్న మహిళలు

### చేయకూడనివి

- మండు వేసవిలో తీవ్ర ఇష్ణోగ్రత సమయంలో ఎక్కువగా తిరగరాదు
- మద్యం సేవించరాదు
- రోడ్లపై చల్లని రంగు పానీయాలు తాగరాదు
- రోడ్లపై అమ్మే కలుషిత ఆహార పదార్థాలను తినరాదు
- మాంసాహారం తగ్గించి, ఎక్కువగా తాజా కూరగాయాలను తీసుకోవాలి
- ఇంటిలో, చుట్టు ప్రక్కల పరిశుభ్రత పాటించి దోమలు లేకుండా చూసుకోవాలి
- నీరు పళ్ల రసాలు, కొబ్బరి నీళ్ల ద్రవ్య పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి
- రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్ల తాగాలి. రెండు పూటల స్నానం చేయాలి. పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలి. భోజనం మితంగా తీసుకోవాలి. లేతవర్ణం, తేలికైన కాటన్‌దుస్తులు ధరించాలి. ఆరు బయట పడుకున్నా దోమ తెరలు వాడాలి.

### 14 నుంచి 16 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**పెదవేగి :** మండలంలోని పెదవేగి విజయరాయి సెక్షన్ జానంపేట సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న జానంపేట, జగన్నాథపురం, సింగవరం, ముత్తనవీడు, గ్రామాలకు మరమ్మతుల నిమిత్తం ఈనెల 14 బుధవారం నుంచి 16 శుక్రవారం ఉదయం 7గంటల నుండి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే ఎం అంబేడ్కర్ చెప్పారు. కావున వినియోగదారులు గమనించి సహకరించవలసినదిగా ఆయన కోరారు.

### వ్యాకుల మాత ఉత్సవాలు

**దెందులూరు:** మండలంలోని కొవ్వలి ఆర్‌సీఎం చర్చిలో సోమవారం వ్యాకుల మాత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. పోతునూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ తంబి ఆధ్వర్యంలో ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరిగాయి. తొలుత వ్యాకుల మాత ప్రతిమ వద్ద ఫాదర్ సంఘస్తులు యువత చిన్నారులు మరియదళ సభ్యులు పూజలు నిర్వహించారు.

### గిరిజన రైతుల అభివృద్ధికి కృషి

**బుట్టాయగూడెం:** పోడు వ్యవసాయం చేస్తున్న గిరిజన రైతుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నా మని కేఆర్‌పురం ఐటీడీఏ ఉద్యాన శాఖ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గిరిజన వికాస్ సంస్థ సహకారంతో పోడు భూముల్లో చిరు ధాన్యాల సాగు చేపట్టే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఐటీడీఏ పరిధిలో సుమారు 1000 ఎకరాల్లో సుమారు 1000 మంది గిరిజన రైతులు పలు చిరు ధాన్యాల పంటలు వేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉద్యానశాఖ ద్వారా సుమారు 47.14 లక్షల వ్యయంతో 310 మంది రైతులకు వ్యవసాయంలో శిక్షణ ఇవ్వడంతో పాటు తైవాన్ స్ప్రేలను కూడా ట్రైకార్ చైర్మన్ చేతుల మీదుగా పంపిణీ చేశామన్నారు. తేనె పరిశ్రమలు ఏర్పాటుకు సంబంధించి కూడా కృషి చేశామని చెప్పారు. సుమారు 310 మంది లబ్దిదారులకు వారి జీవనోపాధికి ఉపయోగపడే విధంగా ఏర్పాటు చేశామని తెలిపారు.

# యోగాతోనే మానసిక ప్రశాంతత



భీమడోలులో యోగాసనాలు చేస్తున్న చిన్నారులు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**భీమడోలు:** యోగతోనే ఏకాగ్రత, ప్రశాంతతలు సాధ్యమని పలువురు వక్తలు తెలిపారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన తరగతులు 12వ రోజైన సోమవారం ఉల్లాసభరిత వాతావరణంలో జరిగాయి. భీమడోలులో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో చిన్నారులకు నీతి కథలు చెప్పడం, వినడం, పుస్తక పఠనం, సమీక్షలు వంటి శిక్షణాంశాలను రిసోర్స్‌పర్సన్లు వివరించారు. మానవత జిల్లా కెరీర్ గైడెన్స్ డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్‌లు చిన్నారులకు నీతి కథలు వివరించారు. మూడు భాషాల్లో ప్రార్థన గీతాలను నేర్పించారు. అనంతరం చిన్నారులకు యోగాసనాలపై అవగాహన కల్పించారు. యోగాతో కలిగే బహుళ ప్రయోజనాలను ఉమామహేశ్వరరావు వారికి వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రతి రోజు అరగంట యోగ చేయాలని, తద్వారా మానసిక, శారీరక ఉల్లాసం సాధ్యపడుతుందన్నారు. అనంతరం చిన్నారులకు ఇండోర్ గేమ్స్‌పై పోటీలు నిర్వహించారు. పూళ్ల గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సామూహిక పుస్తక పఠనం, వివిధ పోటీలు నిర్వహించారు. గుండుగొలను గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో యోగా చేయించారు.

**గ్రంథాలయంలో ఆటల పోటీలు**

**దెందులూరు:** మండలంలోని పోతునూరు గ్రంథాలయంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు జూనియర్, సీనియర్ విభాగాల్లో ఆటలు పోటీలను గ్రంథాలయ అధికారి రాంబాబు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో పాఠశాల విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు సైతం ఆసక్తిగా క్రమం తప్పకుండా శిక్షణ తరగతులలో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఎంపీటీసీల గౌరవ వేతనాలు ఇవ్వండి మహాప్రభో



ఏలూరులో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు

**భీమడోలు:** ఏలూరులో సోమవారం కలెక్టరేట్ వద్ద జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో మండలంలోని వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వీకి లిఖిత పూర్వకంగా అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాటి నుంచి ఎంపీటీసీలుకు గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని, గత ప్రభుత్వ హాయంలో సకాలంలో గౌరవ వేతనాలు అందాయని ఎంపీటీసీలు ముళ్లగిరి జాన్సన్, గంటా శ్రీనివాసరావు, అంబటి దేవీప్రసాద్, ఆళ్ల గోపీకృష్ణలు కలెక్టర్‌కు విన్నవించారు. ఏడాది కావస్తున్నా ఈ ప్రభుత్వం ఇంకా గౌరవ వేతనం చెల్లించలేదని, సంబంధిత అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను సమావేశాలల్లో లేవనెత్తడం నేరమా అని వాపోయారు. ఎంపీటీసీలకు న్యాయపరంగా అందాల్సిన వేతనాలు కూడా చెల్లించకపోవడం దారుణమని తెలిపారు. ఈ నెలలో మొత్తం బకాయిలన్నింటిని చెల్లించాలని ఎంపీటీసీలు వినతిపత్రంలో కోరారు. అదే విధంగా పూళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంపీటీసీ గంటా శ్రీనివాసరావు పూళ్లలో ఓ ఇంటి వద్ద గల విద్యుత్ స్తంభాలను తొలగించాలంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పూళ్ల పీహెచ్‌సీ వద్ద గల చింతాడ చంద్రశేఖర్ ఇంటి వద్ద విద్యుత్ స్తంభాలు ఉండడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, ఇంటి యాజమాని పదే పదేసార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినా విద్యుత్ శాఖ అధికారులు పరిష్కరించడం లేదన్నారు. ఎంపీటీసీగా నా దృష్టికి వచ్చిన సమస్యను తమకు తెలియజేస్తున్నానని, వెంటనే విద్యుత్ అధికారులను ఆదేశించి విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఆయన కలెక్టర్‌ను కోరారు.

## సమ్మె విజయవంతానికి పిలుపు



రాయన్నపాలెంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నేత రామకృష్ణ

**పెదవేగి :** ఈనెల 20న జరిగే దేశవ్యాప్తను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి రామకృష్ణ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెదవేగి మండలం పెదవేగి, రాయన్నపాలెం గ్రామలలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని ప్రదేశాల దగ్గర కార్మిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి. రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధి హామీ కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తానని మోసపూరిత వాగ్ధానాలు అమలు చేసిందని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుకూలంగా ఉపాధి హామీ కూలీలకు రోజువారి వేతనం రూ.600 ఇవ్వాలి కోరారు. జాబ్‌కార్డు లేని కుటుంబాలకు కొత్తజాబ్ కార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన అన్ని పంటలకు గిట్టుబాటు రేటు కల్పించాలని, ప్రభుత్వ మార్కెట్ సౌకర్యం కల్పించి కొనుగోలు చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. మేధావులు, కార్మిక, కర్షక, ఉద్యోగ, కళాకారులు, విద్యార్థులు, యువత, మహిళలు, పెద్ద సంఖ్యలో పాల్గొని మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను ఉపాధి కూలీల పనులు బంద్‌ను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆస్కార అప్పలస్వామి, చంటి, చౌరి కూలీలు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రీవారి మహా కుంభాభిషేకాలు



మహాపూర్ణాహుతిలో పాల్గొన్న రామానుజ జీయర్ స్వామి

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** స్థానిక రామచంద్రరావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ నవాహ్నిక బ్రహ్మోత్సవ సహిత చతుర్వేద హవన ప్రయుక్త విమాన సుదర్శన కలశ ప్రతిష్టా మహా కుంభాభిషేకాలు సోమవారంతో ముగిశాయి. ఉత్సవాల్లో చివరి రోజు కార్యక్రమాల్లో శ్రీ త్రిదండి శ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామి పాల్గొన్నారు. ఉదయం శ్రీ లక్ష్మీ నారాయణ హవనం, ఉత్సవ మహా పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, వైనతేయ ధ్వజావరోహణం, గరుడ ప్రసాద వితరణ, దేవతోద్వాసన, ద్వాదశ ప్రదక్షిణాలు, ద్వాదశ ఆరాధన, శ్రీ పుష్పయాగం, నీరాజన మంత్రపుష్పాలు, మహదాశీర్వచనం, దంపత్తాంబూలాలు, అనంతరం స్వామి వారి పవళింపు సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు.

## కనీస వేతనాలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా నాయకుడు పీ కిశోర్

**పెదపాడు:** గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులతో వెట్టి చాకిరీ చేయించుకుని వారికి కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు ఆర్ శ్రీనివాస దాంగే, ఏఐటీయుసీ జిల్లా నాయకులు పీ కిశోర్ తెలిపారు. ఏలూరులోని స్ఫూర్తి భవన్‌లో ఏఐటీయుసీ నూతన మండల కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్ష కార్యదర్శులను సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల యూనియన్ అధ్యక్షుడుగా ఒంపుగడ్డ ఏసుపాదం, ఉపాధ్యక్షుడిగా పైడి రవిచంద్రకుమార్, పిట్టా జార్జి, కార్యదర్శిగా నరహరిశెట్టి వెంకటేశ్వరరావు, నత్తా ప్రసాద్ సహాయ కార్యదర్శిగా పెరుమాళ్ల తమ్మిరాజు, గెద్దల జోజి, కమిటీ సభ్యులుగా అలకుంట ఎల్లయ్య, కూకటి బాలస్వామి, ఆవుల నీలమ్మ, కలపాల దుర్గలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసదాంగే, కిశోర్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీలలో పంపు ఆపరేటర్లు, పిట్టర్లు, ఎలక్ట్రీషియన్లు, గుమస్తాలు, స్వీపర్లు పలు వృత్తుల్లో కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా టెండర్ విధానం అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ వర్తింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయుసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏలూరు ప్రాంత అధ్యక్షుడు కే కృష్ణమాచార్యులు, ఏలూరు ఏరియా కార్యదర్శి అప్పలరాజు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి భజంత్రీ శ్రీనివాస్ ఏడీసీ నాయకులు బీ జగన్నాథరావు, కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



ఆలయంలో పూర్ణాహుతి పూజలు చేస్తున్న దృశ్యం

**భీమడోలు:** మండలంలోని గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని వార్షిక కల్యాణోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి మంగళ వాయిద్యాల నడుమ ఓ ట్రాక్టర్‌పై స్వామి వార్లను విశేషంగా అలంకరించి శేష వాహనంపై ఊరేగించారు. సోమవారం ఆలయంలో స్వామి వార్లకు చక్రస్నానం, పూర్ణాహుతి పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఆలయ పూజారి మంగపతి అచార్యులు ఆధ్వర్యంలో పూజారుల బృందం స్వామి వార్లకు విశేష పూజలు చేశారు. శాస్త్రోక్తంగా జరుగుతున్న పూజా కార్యక్రమాలను అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈనెల 13వ తేదీ మంగళవారం రాత్రితో కల్యాణోత్సవాలు ముగిస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు వగ్వాల మీనాకుమారి, అచ్యుతరామారావు, పెద్దలు నీలంశెట్టి రాంబాబు, మండిగ వీర్రాజు, భక్తులు పాల్గొన్నారు.

## సారా నిందితుల అరెస్టు

**జంగారెడ్డిగూడెం:** మండలంలోని పలు ప్రాంతాల్లో అక్రమ సారా కలిగిన వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు తెలిపారు. సోమవారం డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ ఎక్సైజ్, జిల్లా అధికారుల ఆదేశాల మేరకు దాడులు చేశామన్నారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెంలో వీరవల్లి శ్రీనివాసరావు వద్ద 5 లీటర్లు, బాలాజీ నగర్‌లో వెలివల కనకరాజు వద్ద 5 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. వీరిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా రిమాండ్ విధించారన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# చదువుతోనే ఉన్నత స్థానాలు

**ఏలూరు (టూటౌన్):** పేదల స్థితిగతులను మార్చి, స్థాయిని పెంచేది చదువు ఒక్కటేనని అసెంబ్లీ స్థానాల పెంపు సాధన సమితి జాతీయ కన్వీనర్, రాష్ట్ర చర్మకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పాలిమేర హరికృష్ణ అన్నారు. స్థానిక గన్ బజార్ సంఘ కార్యాలయంలో గ్రామ – బాట పేరుతో ముద్రించిన కరపత్రాన్ని హరికృష్ణ తదితర నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ గ్రామ బాట పేరుతో వివిధ దళితవాడల్లో విద్యా ఆవశ్యకతను వివరించి పాలేరు, కూలి వ్యవస్థకు దూరంగా చదువు దగ్గరగా దళిత చిన్నారులు ఉండే విధంగా చైతన్యం చేయనున్నట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులను కలిసి చదువు ఆవశ్యకతను తెలియజేసేందుకే గ్రామ బాట కార్యక్రమాన్ని చేపట్టామని వివరించారు. రానున్న సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత దిశగా పరుగులు తీయాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు కాకాని వెంకటేశ్వరరావు, ఏపీ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రమేష్, ప్రసాద్, శ్రీనివాస్, కె.రవి తదితరులు పాల్గొన్నారు.

## కనకదుర్గకు లక్ష మల్లెల పూజ





బావిశెట్టి వారి పేట కనకదుర్గాంబ, అమ్మవారికి లక్ష మల్లెల పూజ చేస్తున్న సువాసినీలు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** పత్తేబాద శ్రీ కనకదుర్గ దేవస్థానంలో వైశాఖ మాసం పౌర్ణమి పర్వదినం సందర్భంగా అమ్మవారికి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం సుహసిని కుసుమాలచే లక్షమల్లెల పూజ నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాయుడు సోము, శారద (దంపతులు), పృథ్వీ సత్యనారాయణ, పోలినాటి సత్తిరెడ్డి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

**బావిశెట్టి వారి పేటలో..**

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** స్థానిక బావిశెట్టి వారిపేట శ్రీ కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవ, పుష్పయాగ మహోత్సవాల్లో భాగంగా అమ్మవారికి సోమవారం ఉదయం లక్ష మల్లెల పూజ చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద సహస్ర జ్యోతిర్లింగార్చన, రాత్రి దర్బారు సేవ నిర్వహించారు.